యథేచ్ఛగా మూగ జీవాల తరలింపు

ఎర్రగుంట్ల : మూగజీవాలైన ఆవులు, ఎద్దులను ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల చెక్‌పోస్టుల ద్వారా తమిళ నాడు, బెంగళూరు తదితర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తరలింపులు మైదుకూరు కేంద్రంగా సాగుతున్నాయని విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలుపుతున్నారు. గతంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఈ అక్రమ తరలింపులను అనేక సార్లు అడ్డుకున్నారు. అయినా వీటి తరలింపులు ఆగడంలేదు. ఇటీవల ఎర్రగుంట్ల మండలం పెద్దనపాడు గ్రామంలో ఆవులను, ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని విశ్వహిందూ పరిషత్ సభ్యులు పట్టుకున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అక్రమ మూగజీవాల తరలింపును ఆపాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరుతున్నారు.


మూగజీవాలను తరలిస్తున్న లారీ (ఫైల్)

తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



"మూగ జీవాలను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారం మైదుకూరు ప్రాంతం కేంద్రంగా నడుస్తోంది. విశ్వహిందూ పరిషత్ తరుపున చాలా సార్లు మూగజీవాల తరలింపు అడ్డుకున్నాం. అయినా అక్రమదారులు వారి పనిని వారు చేసుకుంటు పోతున్నారు. హిందువులు ఐక్యంగా ఉండి ఈ మూగ జీవాల తరలింపును అడ్డుకోవాలి."
- రామమోహన్, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి, ఎర్రగుంట్ల

కార్లకు స్టాండుగా మారిన మార్కెట్

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీరామ హాల్ సమీపం మసీదు పక్కన వ్యాపారస్తులకు, రైతులకు అధికారులు కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అయితే స్థానికులు మాత్రం మార్కెట్‌ను కార్ల స్టాండ్‌గా ఉపయోగిస్తున్నారు. దీంతో వ్యాపారం చేసుకునేందుకు రైతులు, వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్కడ కార్లు ఉంచకుండా చేయాలని వ్యాపారస్తులు, రైతులు కోరుతున్నారు.


మార్కెట్‌ను కార్ల స్టాండుగా ఉపయోగిస్తున్న స్థానికులు

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

వేంపల్లె : విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని యూత్ సీడబ్ల్యూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, తిరుపతి పట్టణంలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద 5వ తేదీన చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని గోడపత్రాలను విద్యుత్ కార్మికులతో కలిసి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనువాసులు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యుత్ కార్మికుడు ఈ ధర్నాకు తరలి రావాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్ స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ చేసి స్కిల్డ్ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్ మెన్‌ను నియమించాలని కోరారు. రాష్ట్రంలో 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న 23,500 విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఏదైనా అనారోగ్య సమస్య, యాక్సిడెంట్లు సమస్య వచ్చిన ప్పుడు ఉచితంగా ప్రభుత్వమే వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సబ్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం

వేంపల్లె : మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు అమ్మ పేరుతో ఒక మొక్కపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వి.సునీత తెలిపారు. శనివారం మండలంలోని కుమ్మరాంపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ఆమె మొక్క నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు చిన్న వయసులోనే అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వర్ణలత, సర్పంచ్ మునేష్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న సీడీపీఓ సునీత

రోడ్లపై పశువులు కనిపిస్తే జరిమానా

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రధాన రహదారిలో పశువులు కనిపిస్తే వాటి యజమానులకు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఆవులు పదుల సంఖ్యలో ఉండటంతో ప్రజలు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి యజమానులు రోడ్లపైన, వీధుల్లో వదిలితే జరిమానాలు విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

పులివెందుల రూరల్/టౌన్ : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పులివెందులలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో సెప్టెంబర్ 2వ తేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తదాన శిబిరంతో పాటు పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, నూరుబాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్‌గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు

ఆ ఉపాధ్యాయురాలే కావాలని నిరసన

కొండాపురం : మాకు ఆ ఉపాధ్యాయురాలే కావాలని మండలంలోని దత్తాపురం వాసులు శనివారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మిగులు ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా దత్తాపురం బీసీ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయురాలు టి.పద్మావతిని ఎర్రగుంట్లలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. దీంతో మాకు ఆ ఉపాధ్యాయురాలే కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓలు ఓబులేసు, రామయ్యలకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఎంఈఓ ఓబులేసును వివరణ కోరగా.. ఈ బదిలీ నియమనిబంధనల ప్రకారం జరిగిందన్నారు. వినతిపత్రంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పులివెందుల రూరల్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల మండల ప్రజలకు, అన్ని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పోలీస్ వారి హెచ్చరికలను తెలుపుతున్నామన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా చట్ట వ్యతిరేక చర్యలు నివారించడంలో భాగంగా 30 పోలీస్ యాక్షన్ అమల్లో ఉందన్నారు. పోలీసుల అనుమతి లేనిదే ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ హెచ్చరికలను అతిక్రమిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

ఎండోమెంట్ ఈఓను విచారించిన ఇన్‌స్పెక్టర్

పులివెందుల టౌన్ : స్థానిక మిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం మద్యం సేవిస్తున్న ఘటన సోషల్ మీడియాలో వార్త కథనాలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ఈ సంఘటనపై విచారణ జరపాలని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నరసింహసిగ్స్‌ను పులివెందులకు పంపించారు. దీంతో ఆయన శనివారం ఈఓ విశ్వనాథరెడ్డిని విచారించి వివరాలు సేకరించి అధికారులకు నివేదించారు.


విశ్వనాథరెడ్డిని విచారిస్తున్న ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నరసింహ సిగ్స్

కమలాపురంలో భారీ వర్షం

కమలాపురం : కమలాపురంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ భారీవర్షం కురుస్తూనే ఉంది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయు గుండంగా మారడంతో కమలాపురంలో 62.4 మి.మీ. వర్షపాతం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బ్రాహ్మణ వీధి, కృష్ణానగర్, వినాయకనగర్, మారుతినగర్, బీడీ కాలనీ తదితర కాలనీల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షం నీరు నిలవడంతో పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షం కురిసే సమయంలో పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జలమయమైన మార్కెట్ వీధి

చిరు జల్లులు పడుతున్నా.. లెక్క చేయకుండా

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జననీరాజనం

వల్లూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం పెండ్లిమర్రి మండల పరిధిలోని మాచనూరు, గొందిపల్లె గ్రామాల్లో పర్యటించారు. కడప విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరిన ఆయనకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. ఒక పక్క ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా జగన్ రాక కోసం ఎదురు చూశారు. ప్రతి చోట బాణా సంచా కాలుస్తూ, పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. వల్లూరు మండల పరిధిలోని తోల్లగంగనపల్లె, వల్లూరు, తప్పెట్ల, పాపాఘ్ని నగర్, వెంకటాపురం వీవర్స్ కాలనీ, దుగ్గాయపల్లె, పెద్దపుత్త, పెద్దపుత్త అడ్డదారి, పైడికాలువ క్రాస్, పైడికాలువ, పెండ్లిమర్రి మండల పరిధిలోని కొత్తపేట మీదుగా మాచనూరుకు చేరుకున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, అభిమానులు ఆయనను చూడటానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి చోట ముఖ్యంగా మహిళలు, యువత ఆయనను చూసి సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు. ప్రతి చోట జగన్ కారు దిగి అభివాదం చేస్తూ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. అడిగిన వారందరితో ఓర్పుగా సెల్ఫీలు దిగారు. దీంతో ఆయన పర్యటన ఆద్యంతం ఆలస్యంగా సాగింది. అయినప్పటికీ ప్రజలు ఆయన రాక కోసం ఎదురు చూశారు. తోల్లగంగనపల్లె వద్ద ఆయన ఒక పాపను ఎత్తుకుని ముద్దాడాడు. దుగ్గాయపల్లెలో ఏపీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి స్వగృహానికి వెళ్లారు. అక్కడ మల్లికార్జునరెడ్డి తల్లి సుబ్బలక్షుమ్మను జేజీ బాగున్నావా అంటూ ఆప్యాయంగా పలకరించి ఆమె యోగ క్షేమాలు అడిగారు. ఆయన వెంట ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, మాజీ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కమలాపురం వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులురెడ్డి వున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు ఉత్తమారెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బాలిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఓవీ సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, సిద్దారెడ్డి, హరికేశవరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, మునీంద్రారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, వల్లూరు, కమలాపురం మండలాలకు చెందిన పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాచునూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


జగనన్న కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, చిన్నారులు

పెండ్లిమర్రి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెండ్లిమర్రి మండలంలో పర్యటించారు. మాజీ సీఎం కాన్వాయ్ మాచునూరు, చౌటపల్లె, బుద్దాయపల్లె, తుమ్మలూరు క్రాస్ రోడ్డు, నాగాయపల్లె క్రాస్ రోడ్డు, పగడాలపల్లె, ద్వారకానగర్, జీసీపల్లె, బాలయ్యగారిపల్లె, గొందిపల్లె, ఇందిరానగర్, శాంతినగర్, తిప్పరాజుపల్లె, నందిమండలం, కొత్తగంగిరెడ్డిపల్లె, సోగాల్‌పల్లె మీదుగా వేంపల్లెకు చెరుకున్నది. మాచునూరు నుంచి ప్రతి ఒక్క గ్రామం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికి సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ బాలయ్య, మాజీ మండల ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో చోరీ

ఎర్రగుంట్ల : పట్టణంలో ఓ మొబైల్ షాపు, జనరల్, మెడికల్ స్టోర్‌లలో చోరీ జరిగింది. అయితే ఈ చోరీలలో ఏఏ షాపులలో ఎంత మొత్తం దొంగలించారో తెలియలేదు. అయితే మొబైల్ షాపులలో ఉన్న సీసీ పుటేజీలో దొంగలు షాపులోకి చొరబడి మొబైల్స్, డబ్బులు తీసుకెళ్లారని షాపు నిర్వాహకుడు తెలిపారు. ఈ విషయంపై పట్టణ సీఐ నరేష్‌బాబును వివరణ కోరగా చోరీ జరిగిన విషయం తెలిసిందని, అయితే ఇంత వరకు ఫిర్యాదు రాలేదన్నారు.

గండి దర్శనానికి వెళ్లే భక్తులకు అన్నదానం

వేంపల్లె : గండిక్షేత్రం వీరాంజనేయస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా స్థానిక శ్రీసాయి రజిత గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రాధికరెడ్డిల జ్ఞాపకార్థం ఈ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైకాపా కన్వీనర్ కె.చంద్రఓబుల్‌రెడ్డిలు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


భక్తులకు అన్నం వడ్డిస్తున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

మానవత విలువలను పెంపొందించుకోవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు మానవతా విలువలను పెంపొందించుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం కళాశాలలో మానవతా విలువలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కలిగి బాధ్యతతో ప్రకృతి వనరులను కాపాడుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడుకున్న జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. పీఆర్వో బాలనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుధీరలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

క్లుప్తంగా

ముగిసిన శ్రావణ శనివారాలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

పులివెందుల టౌన్ : శ్రావణ మాస నాల్గవ శనివారం సందర్భంగా పట్టణంలోని అంజన్న ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యంలేకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో అంజనేయస్వామి

వీరపునాయునిపల్లె : శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ అంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బానాయుడు చర్యలు చేపట్టారు.

29 పింఛన్ల తొలగింపు

లింగాల : మండలంలో ఆగస్టు మాసానికి సంబంధించిన వికలాంగుల పింఛన్లు 29 తొలగించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు తెలిపారు. సచివాలయాల పరిధిలోని బోనాల 2, చిన్నకుడాల 1, గునకనపల్లె 1, ఇప్పట్ల 1, కోమన్నూతల 9, లింగాల 8, మురారిచింతల 1, పార్నపల్లి 1, పెద్దకుడాల 4, వెలిదండ్ల 1 పింఛన్లను తొలగించినట్లు ఆయన తెలిపారు. వికలాంగుల పింఛన్ లబ్ధిదారులను ఇటీవల సదరన్ క్యాంపునకు పంపి వారిని అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

పింఛన్ పంపిణీ పరిశీలన


లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం సచివాలయ ఉద్యోగులకు సెలవు ఉండటంతో ఆగస్టు 31వ తేదీనే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఎంపీడీవో కృష్ణమూర్తి బలపనూరు, అంకాలమ్మ గూడూరు గ్రామాలలో పర్యటించి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మిగిలిన పింఛన్లను సోమవారం పంపిణీ చేస్తారన్నారు.

బోర్డులో మార్చిన పేరు


బోర్డులో పేరు మార్చిన దృశ్యం


సాక్షి ఎఫెక్ట్..

పులివెందుల రూరల్ : పట్టణంలోని మండల సభాభవనంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.దివాకర్ బదిలీపై వెళ్లి 30 రోజులు అవుతున్నప్పటికీ కార్యాలయానికి ఉన్న బోర్డుకు మాత్రం ఆయన పేరు అలాగే ఉంచారు. దీంతో సాక్షిలో అధికారి మారినా.. పేరుమాత్రం మారలేదు అనే వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు బోర్డులో ఉన్న ఎంపీడీఓ దివాకర్ పేరును తొలగించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ పేరును చేర్చారు.

రైతుల ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే కట్టాలి

పులివెందుల రూరల్ : రైతులు కట్టాల్సిన ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే కట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ఇన్సూరెన్స్‌ను ఇన్సూరెన్స్ కంపెనీ వారు చెల్లించాలి. ఇంతవరకు చెల్లించకపోవడంతో పంటలు దెబ్బతిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయలేని పక్షంలో పోరాటం చేస్తామన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాముడు



పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా డి.రాముడు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌లను కలుసుకుని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.